ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 16 ఏప్రిల్ 2025 | 5

అంబేడ్కర్‌కు అవమానం

● శంఖవరంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు 7

వివాహిత అనుమానాస్పద మృతి 7

కాకినాడలో ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు ప్రారంభం

» ఉత్సాహంగా పాల్గొన్న నాలుగు బెటాలియన్ల క్రీడాకారులు 6

మారుతున్న వాతావరణం - రైతుల్లో కలవరం

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రహదారులు, కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటకు వర్షం పడితే నష్టం జరుగుతుందని వారు కలవరానికి గురవుతున్నారు. అల్పపీడన ప్రభావం తప్పినప్పటికీ రైతులను వాతావరణమార్పులు వెన్నాడుతూనే ఉన్నాయి. మూడు రోజుల క్రితం కురిసిన ఆకాల వర్షాలు, ఈదురుగాలుల ప్రభావానికి దాళ్వా వరిపంటతో పాటు అన్ని రకాల పంటలు సాగు చేసిన వారికి తీరని నష్టం కలగచేసింది. ప్రస్తుతం జిల్లాలో దాళ్వా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏలేరు, పీబీసీ ఆయకట్టులో 30శాతం విస్తీర్ణంలో ఇప్పటికే మాసూళ్లు పూర్తయ్యాయి.వరి కోత యంత్రాలతో కోతలు, మాసూళ్లు పూర్తిచేయడంలో కొందరు నిమగ్నమయ్యారు. మంగళవారంనుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం, మరో మూడు రోజులు పాటు జల్లులు, స్వల్ప వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



చిరుజల్లులు పడటంతో గొల్లప్రోలు శివారులో ఆరబోసిన ధాన్యం రాశులకు బరకాలు కప్పుతున్న కార్మికులు

ఉమ్మడి జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన 7

» అమరావతి ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతిరావు

» కాకినాడలో ప్రత్యేక అధికారులకు వర్క్‌షాప్

పెడితే.. తిరిగి రాధే!

మనీకుమార్..మాయాజాలం

"హాయ్..మీకో బెట్టింగ్ యాప్ చెబుతా.. తెలి సిన వారి ద్వారా ఇందులో పందేలు కాయిస్తే వచ్చిన లాభాల్లో 10 శాతం మీకే.. ఇదిగో యాప్ లింకు.. యూజర్ ఐడీ.. పాస్‌వర్డ్.. మీరే కాదు... మీకు నచ్చినంత మందికి ఇవి షేర్ చేసి ఎంత మందితో ఆడిస్తే అంత లాభాలు" అంటూ కాకినాడకు చెందిన మణికుమార్ అలియాస్ పండు సొంతంగా తయారుచేసిన 'రాధే' అనే బెట్టింగ్ యాప్‌తో రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది బుకీలు, సబ్ బుకీలను నియమించుకున్నాడు.. పోలీసులకు తెలిస్తే తక్షణమే యాప్‌లో అత్యవసర బటన్ ఏర్పాటు చేశాడు.. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కోట్లు లాగేశాడు.



కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరుడు ఘాజీ (పేరు మార్చాం). గడచిన అయిదేళ్లలో కాకినాడ నగరం కేంద్రంగా పేకాట, బెట్టింగ్ యాప్‌లతో సంపాదించింది అక్షరాలా రూ.70 కోట్లు పైమాటే.. రాత్రయితే నగరంలో ప్రముఖులకు ఖరీదైన బస కల్పించి బెట్టింగ్‌లు ఆడించి తెగ నొల్లేశాడు. ప్రభుత్వం మారాక కూడా కొనసాగిస్తుండగా డెన్ బయటపడి ఇప్పుడు రహస్యంగా ఇళ్లల్లో జూదం, బెట్టింగ్ యాప్‌లు ఆడిస్తున్నాడు. అటు పండు అయినా.. ఇటు ఘాజీ అయినా వీరిద్దరి ఘరానా బెట్టింగ్ నిర్వాహకుల తెరవెనుక వెన్నుదన్ను కాకినాడ వైసీపీ కీలక నేతే. ఇటీవల పండు వరంగల్‌లో పట్టుబడితే అక్కడ మంత్రికి ఫోన్ చేసి కేసు నీరుగార్చేలా చేశాడు. - కాకినాడ/ ఆంధ్రజ్యోతి)



- కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా
- యాప్ తయారు చేయించి కోట్లలో జూదం
- పందేలు కట్టిస్తే లాభాల్లో 10 శాతం వాటా
- బుకీలు, సబ్‌బుకీలు నియామకం
- రాధే ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా కోట్లు
- దందాకు వైసీపీ కీలకనేత అండదండలు
- తీగలాడితే కదిలిన డొంక

కాకినాడలో గతంలో ఎక్కడా బెట్టింగ్‌ల వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా బెట్టింగ్‌లు భారీగా పెరిగిపోయాయి. పై రెండు ఉదాహరణలు చాలు కాకినాడ కేంద్రంగా బెట్టింగ్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లానుకుపోయిందో చెప్పడానికి. ఇక్కడి నుంచే వీరిద్దరు కాకుండా అచ్చం వీళ్ల తరహాలో అనేకమంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్‌లో రమ్మీ, క్రికెట్ బెట్టింగ్, కేసినోలు ఆడిస్తూ వేలాది మంది డబ్బు జూదంలో పోగొట్టుకోగా, వీరు మాత్రం కోట్లకు పడగలెత్తారు.

బెట్టింగ్ యాప్‌ల కేరాఫ్ కాకినాడ..

తీగలాగితే డొంక కదిలింది.. కాకినాడ కేంద్రంగా సాగే బెట్టింగ్ ముఠా బయటపడింది. కాకినాడ నగరానికి చెందిన పండు ఏకంగా సొంతంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారుచేసి అనేక రాష్ట్రాల్లో బుకీలు, సబ్‌బుకీలను నియమించుకుని కోట్లకు పడగలెత్తాడు. ఇటీవల వరంగల్‌లో దొరికిన బెట్టింగ్ బాబులను లోతుగా విచారిస్తే కాకినాడ కేంద్రంగా పండు సాగించిన బెట్టింగ్ మాఫియా బయటపడింది. దీంతో పండును అరెస్ట్ చేసి విచారిస్తే పండు ఖాతాలో రూ.5 కోట్లు గుర్తించారు. ఇదంతా బెట్టింగ్ ద్వారా సంపాదించినదేనని తేల్చారు. తాజాగా కృష్ణా జిల్లాలోను పట్టుబడ్డ బుకీలను విచారిస్తే అక్కడా సదరు పండు పేరే బయటకు రావడంతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేయబోతున్నారు. అయితే అటు తెలంగాణ, ఇక్కడ కృష్ణాలో పట్టుబడ్డ బెట్టింగ్‌బాబులను అరెస్ట్ చేసి ప్రశ్నిస్తే కాకినాడ కేంద్రంగా వెలుగు చూస్తున్న బెట్టింగ్ దందా చూసి పోలీసులే నివ్వెరపోయి నోరెళ్లబెడుతున్నారు. దీంతో ఇప్పుడు బెట్టింగ్ యాప్‌ల తీగ లాగితే డొంక కాకినాడలో తేలుతుండడంతో పోలీసులంతా అవాక్కవుతున్నారు.

ఐదేళ్లు.. రూ.70 కోట్లు కమీషన్..

కాకినాడ వైసీపీ కీలకనేత అనుచరులు కొందరు ఇళ్లు అద్దెకు తీసుకుని పేకాట నిర్వహించేవారు. కొన్ని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సదరు నేత కీలక అనుచరుడు నగరంలో జూదరులకు పరిచయం చేశాడు. వారి ద్వారా ఈ యాప్‌ల్లో రోజుకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు కూడా పందేలు కాయించేవారు. సదరు వైసీపీ కీలకనేత అనుచరుడికి కమీషన్లు భారీగా రావడంతో రెచ్చిపోయి వ్యాపారం పెంచేశాడు. గడచిన ఐదేళ్లలో సదరు వ్యక్తి పేకాట నిర్వహణ, యాప్‌ల కమీషన్ ద్వారా రూ.70 కోట్ల వరకు సంపాదించాడు. ఇందులో రూ.14 కోట్లతో నగరంలో ఇటీవల ఖరీదైన భవంతిని నిర్మించాడు. అయితే బెట్టింగ్‌ల విషయం తెలిసినా పోలీసులు జోలికిరాకుండా ఉండేందుకు నెలకు లక్షల్లో మామూళ్లు పంపాడు. కొంతకాలం కిందట ప్రభుత్వం మారాక తిరిగి పేకాట ఆడించేందుకు ప్రయత్నించగా దొరికిపోవడంతో ఇప్పుడు యాప్‌ల ద్వారా జూదం కొనసాగిస్తున్నాడు. ఇప్పటికీ ఐపీఎల్, ఇతర క్రికెట్ మ్యాచ్‌లు వస్తే సదరు వ్యక్తి కోట్లలో యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడు. ఇటీవల మళ్లీ నగరంలో పలు ఇళ్లను అద్దెకు తీసుకుని యథేచ్ఛగా పేకాట, ఇతర జూదం ఆడిస్తున్నాడు. పోలీసులకు విషయం ముందే చెప్పి మామూళ్లు పంపేస్తున్నాడు.

కోట్లు 'పండు'లా రాలుతున్నాయి..

సదరు ఘాజీతో జూదంలో పరిచయాలు ఉన్న కాకినాడకు చెందిన వీరమణికుమార్ అలియాస్ పండు బెట్టింగ్‌ను వ్యాపారంగా మార్చేశాడు. కాకినాడ కేంద్రంగా రాధే ఎక్స్ఛేంజ్ బెట్టింగ్ యాప్ తయారు చేశాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణ వరకు ఈ యాప్‌ను అనేక మంది బుకీలు, సబ్ బుకీలకు పరిచయం చేశాడు. యాప్‌లో జూదం ఆడిస్తే వచ్చిన లాభాల్లో పది శాతం కమీషన్ ఎర చూపాడు. వీరందరికి యాప్ లింకు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందించాడు. వీరంతా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేలా చేశాడు. అందులో భాగంగా తను తయారు చేసిన బెట్టింగ్ యాప్‌నకు కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కిరణ్‌కుమార్‌ను అడ్మిన్‌గా నియమించాడు. సదరు అడ్మిన్ పది శాతం కమీషన్ ఆశతో బుకీలు,సబ్ బుకీలను నియమించాడు. కిరణ్ ఇటీవల పోలీసులకు దొరికిపోడంతో పండు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. వరంగల్‌లో పోలీసులకు చిక్కిన కొందరు బుకీలు ఇచ్చిన సమాచారంతో పండు అసలు సూత్రధారుడిగా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చిన రూ.5 కోట్ల లాభం ఖాతాలో గుర్తించారు. ఇందులో కోటితో ఇటీవల కాకినాడలో ఓ అపార్ట్ మెంట్ కొనుగోలు చేశాడు. అయితే పండు అరెస్ట్‌తో అవాక్కయిన కాకినాడ వైసీపీ కీలకనేత అక్కడ తన పాత పరిచయాలతో ఆ మంత్రితో మాట్లాడి కేసులోతుల్లోకి వెళ్ల కుండా ప్రయత్నాలు చేశారు. సదరు పండు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది బుకీలతో ఇప్పటికీ జూదం ఆడిస్తున్నాడు. సదరు పండు యాప్ ద్వారా రూ.40 కోట్ల వరకు సంపాదించినట్టు సమాచారం. కానీ పోలీసులు ఇదెక్కడా పెద్దగా పట్టించుకోవడంలేదు. వరంగల్‌లో అరెస్టయిన సదరు పండును ఇక్కడా విచారిస్తే ఉమ్మడి జిల్లాలో అనేక ఘోరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ దిశగా పోలీసులు అడుగులు వేస్తారని అనుకోలేం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి



కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు మండలం పెనకనమెట్టకు చెందిన తాడి వినోద్ (30) ఒరామి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోం పనిచేస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లో రూ.లక్ష పోగొట్టుకోవడంతో తండ్రి వెంకటేశ్వరరావు మందలించాడు. బెట్టింగ్ గేమ్‌లలో అప్పుల పాలవ్వడంతో ఈనెల 14వ తేదీన కలుపుమందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడ నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ బాబూరావు తెలిపారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

శిశు మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అధ్యక్షతన శిశు మరణాలపై జిల్లా సబ్ కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలో గత నెలలో జరిగిన శిశు మరణాలకుగల కారణాలు విశ్లేషించారు. శిశువుకు జనన సమయంలో ఊపిరాడకపోవడం(బర్త్ యాస్ఫిక్సియా), బిడ్డకు తల్లి పాలు సరిగా ఇవ్వక పోవడంవల్ల పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస ఆడక బిడ్డ మరణించడం, మేనరిక వివాహాల వల్ల, ప్రమాదకరమైన వస్తువులకు చంటి పిల్లలను దూరంగా ఉంచడం ద్వారా ముందుగా ప్రమాదాలను గుర్తించి మరణాలను అరికట్టవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు అయ్యేలా చర్యలు చేపట్టడం, ప్రసవానంతర సేవలు అమలు చేయాలని ఆరు హెచ్‌బీఎన్‌సీ గృహ సందర్శనలు తప్పనిసరిగా చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో మార్చి నెలలో జరిగిన 23 శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించారు. సమావేశంలో డీఐవో కేవీ సుబ్బరాజు, జీజీహెచ్ పిడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ భాస్కర్, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ జి.వనజ, నీలవేణి, గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణశాఖ డీపీఎంగా మమ్మీ

కాకినాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొత్తం 16మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సాధారణ పరిపాలనశాఖ జీఓ ఆర్‌టీ నెం.713 ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో భాగంగా డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీని కాకినాడ జిల్లా విపత్తుల నిర్వహణశాఖ డీపీఎంగా బదిలీ చేశారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరిహారం చెల్లింపునకు వేళాయే..

- 26న మత్స్యకారులకు పరిహారం చెల్లింపు
- రూ.10వేల నుంచి రూ.20 వేలకు పెంచుతారా?

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏడాదికాలంగా ఎదురు చూస్తున్న మత్స్యకారులకు చేపల వేట నిషేధ సమయంలో పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గతేడాది మత్స్యకారులకు అప్పటి వైసీపీ ప్రభుత్వం వేట నిషేధ నష్టపరిహారం చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నష్ట పరిహారం రూ.10వేలనుంచి రూ.20 వేలకు పెంచి చెల్లిస్తామని నేతలు ప్రకటించడంతో మత్స్యకారులు ఊరట చెందారు. ఈ ఏడాది వేట నిషేధ కాలం ఈ నెల 15నుంచి అమలులోకి వచ్చింది. దీంతో మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం త్వరలోనే పరిహారం చెల్లిస్తామని సంకేతాలు పంపింది. ఈ 26న వేట నష్ట పరిహారం చెల్లించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. గతేడాది నష్టపరిహారం బకాయిలు చెల్లిస్తారా, ఈ ఏడాది పరిహారం చెల్లిస్తారా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. నష్టపరిహారం మాత్రం రూ.10 వేల నుంచి రూ.20 వేలకుపెంచి అందజేస్తారని సమాచారం అందింది. కాకినాడ జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు 395, మోటరైజ్డ్ బోట్లు 3,694 ఉన్నాయి.కాకినాడ, ఉప్పాడ, తాళ్లరేవు, తొండంగి తీర ప్రాంతంనుంచి మత్స్యకారులు బోట్ల ద్వారా సముద్ర జలాల్లో వేట సాగిస్తున్నారు. వీటిపై ఆధారపడి 25,419మంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. నిషేధం అమలుకు మత్స్య శాఖ కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, రెవెన్యూ యంత్రాంగంతో గస్తీ ఏర్పాటు చేసింది.

ధాన్యం మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దు

అలా కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల పండించిన ధాన్యం ఆరబెట్టిన చోట గానీ, కొనుగోలు కేంద్రంలోగానీ టెక్నికల్ సిబ్బంది పరిశీలించి డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెహికల్ మూమెంట్ జీపీఎఫ్ ట్రాక్ చేసి మిల్లుకు పంపిస్తామన్నారు. అలా చేసిన వారికి సరైన సమయంలో ఆన్‌లైన్‌లో రైతుల బ్యాంకు అకౌంట్లో డబ్బులు పడడంతోపాటు మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వం జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసి ఇప్పటికే 2,570 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 207మంది రైతులనుంచి కొనుగోలు చేశామన్నారు. క్వింటా సాధారణ రకం రూ.2300, గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మట్టి, రాళ్లు, ఇసుక మొదలగు వ్యర్థపదార్థాలు 1.0శాతం, గడ్డి, చెత్త, తప్పకలుపు విత్తనాలు 1.0శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యపుగింజలు 5.0శాతం మించరాదన్నారు. తేమ 17శాతం కన్నాతక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించి మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. రైతులకు 7337359375 వాట్సాప్ నెంబర్ ద్వారా ఆర్‌ఎస్‌కేకీ వెళ్లనవసరం లేకుండా నేరుగా షెడ్యూలింగ్ చేసుకొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలు అర్హులందరికీ అందాలి

- 20 సూత్రాలు అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష



కలెక్టరేట్ జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర 20సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్సీ పద్మశ్రీ

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాల లబ్ధిని అర్హులైన వారికి అందేలా అవగాహన కల్పించి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సంకల్పించిన వికసిత భారత్-2047, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధనకు చర్యలు చేపట్టి వికసిత కాకినాడ సాధనకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ కోరారు. 20సూత్రాల అమలు చైర్మన్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పురోగతి, చేపట్టిన ప్రాజెక్టుల అమలు తీరు, మౌలిక సదుపాయాలు కల్పనపై వివిధ శాఖలజిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు లక్ష్యసాధనలో కాకినాడ జిల్లా పరిధిలో ఉన్న అవకాశాలు, ఎదురయ్యే సవాళ్లను అధిగమించి విజయవంతంగా వికసిత కాకినాడ జిల్లాగా రూపుదిద్దవచ్చు అనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు.

ఉపాధి హామీ పథకం

ఈసంవత్సరం ఉపాధి హామీ బడ్జెట్ మెటీరియల్ కాంపోనెంట్, వేతనాల బడ్జెట్‌లో 96శాతం పూర్తి చేసుకుని 189.44కోట్లు వాస్తవ చెల్లింపులు జరిగాయన్నారు. గత ఐదేళ్ల ఉపాధి హామీ మెటీరియల్, లేబర్ కాంపోనెంట్ బడ్జెట్, వాస్తవంగా ఖర్చుచేసిన వివరాలు, నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసిన వివరాలు ఇవ్వమని అధికారులను ఆదేశించారు. ఒకరోజుకు ఉపాధిహామీ వేతనం రూ.300 అయితే జిల్లాలో సగటున రూ.253 ఇంకా పెంచేందుకు కృషి చేయాలన్నారు.పల్లెపండుగ కింద సీసీ రోడ్లు లక్ష్యంతో 93శాతం సాధించి 146.42 కి.మీ, పశువుల షెడ్ల నిర్మాణం లక్ష్యానికి మించి 149 శాతంతో 1045 షెడ్లను పూర్తి చేశారన్నారు.

జల్‌జీవన్‌మిషన్

గత ఐదేళ్ల జల్‌జీవన్ మిషన్ దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత లేకుండా 2019-24 మధ్య పనులు చేయడంవల్ల నిర్దేశించిన లక్ష్యాలు జిల్లా చేరుకోలేకపోయిందన్నారు, జిల్లాలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు కుళాయిద్వారా ఇవ్వాలంటే ఇప్పుడు రూ.1650 కోట్లు అవసరం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారన్నారు.

గ్రామీణ సడక్ యోజన

గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాలలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు అనుసంధానం కానీ గ్రామీణ రహదారులకు సంబంధించి జిల్లాలో గ్రామీణ సడక్ యోజన 111 కింద రూ.29.39కోట్ల అంచనా వ్యయంతో 47.13 కి.మీ సంబంధించిన 7పనులలో 9.66కోట్లను ఇప్పటివరకుఖర్చు చేశారన్నారు.

లాక్ పతిఅండ్ డ్రోన్‌దీదీ

జిల్లాలో స్వయం సేవ గ్రూపులలోని మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలనే లాక్‌ప్రతి దీదీలుగా 1,38,267మందిని గుర్తించినట్లు అధికారులు సమాచారం ఇచ్చారన్నారు.

పీఎంఏవైఅండ్ టిడ్కో

పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ కింద జిల్లాలో కేటాయించిన 85,482 గృహాలకు 28,494 గృహాల్లో పనులు పూర్తి లబ్ధిదారులు నివసిస్తున్నారన్నారు.

అమృత్ 1.0అండ్ 2.0

జిల్లాలలో అన్ని పట్టణప్రాంతాల్లో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం, ఎస్టీపీ కోసం,వాటర్‌పంపింగ్‌కోసం, సీవరేజ్‌లైన్ కోసం అమృత్ 1.0కింద 2016-17లో ఫేజ్1లో కాకినాడ పట్టణానికి కేటయించిన 20,415 నీటికుళాయిల కోసం రూ41.45కోట్లతో 113.68 కిమీ పైప్‌లైన్ పనులను రూ.37.35కోట్లకు పూర్తి చేశారన్నారు.

పీఎం సూర్యఘర్

పీఎం సూర్యఘర్‌పథకం అమలులో వేగం పెంచాల న్నారు. ఈపథకంకింద కనిష్టం గా రూ.30వేలు, గరిష్టంగా రూ.78వేలు సబ్సిడీ కేంద్రప్రభుత్వం ఇస్తుందన్నారు.

వ్యవసాయ రంగానికి సాయం

పీఎం కుసుమ్ పథకం ద్వారా నాణ్యమైన నిరంతరాయ వ్యవసాయ విద్యుశ్చక్తి సరఫరా కోసం ప్రవేశపెట్టిన ఈపథకం పురోగతిపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2024-25న 1,20,719మంది రైతులు సంవత్సరానికి 6వేలు పీఎం కిసాన్ సమ్మాన్ నిధిసహాయం పొందుతున్నారన్నారు.

పీఎం విశ్వకర్మ

పీఎం విశ్వకర్మయోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం సహాయంతో 18రకాల చేతి వృత్తుల వారికి నైపుణ్యశిక్షణ రూ.15వేల టూల్ కిట్, సబ్సిడీ వడ్డీపైన బ్యాంకు రుణం కోసం జిల్లాలో 5,495 దరఖాస్తులురాగా, 3,821 మందికి శిక్షణ పూర్తయినవారికి రుణాలు అందించాలన్నారు.

పీఎం స్వనిధి

పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులు కేంద్ర ప్రభుత్వం సహాయంతో జిల్లాలో 23,341మందికి రూ.10వేలు రుణాలు అందజేశారన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్రం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ప్రతిఒక్కరికి 5కిలోల ఉచిత బియ్యం ఇస్తారన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలురకం పశువుల సంతాన ఉత్పత్తి పెంచడం ఆవులు, గెదేలు సబ్సిడీపైన రుణాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధికోసం కేంద్ర ప్రాయోజిత ప్రసాద్ పథకం కింద అన్నవరం దేవస్థానంకోసం 25.32కోట్లు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 5,442.02 ఎకరాల భూమి పారిశ్రామిక అవసరాల కోసం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, డీఆర్వో వెంకట్రావు, జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి త్రినాథ్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త.. యుగ పురుషుడు

వీరేశలింగం



కందుకూరి వీరేశలింగం తైలవర్ణ చిత్రం

(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

వివిధ సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడు, గొప్ప సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, యుగ పురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన గురించి ఈ తరానికి తెలిసింది తక్కువే. ఆయన స్త్రీ విద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలను కూడా స్థాపించారు. వితంతు పునర్వివాహాల ద్వారా ఆయన గొప్ప ఆదర్శవాదిగా పేరుగాంచారు. 1983లో వచ్చిన ఆంధ్రకేసరి చిత్రంలో రాజమహేంద్రవరం నగర గొప్పతనాన్ని వర్ణిస్తూ 'వేదంలా ఘోషించే గోదావరి' అంటూ ఓ పాట రాశారు.. ఇందులో 'కొట్టుకొని పోయె కొన్ని కోటి లింగాలు... వీరేశలింగమొకడు మిగిలెను చాలు' అని రాశారు గేయరచయిత. అంటే రాజమహేంద్రవరం చరిత్రలో వీరేశలింగం ఎంత ప్రాధాన్యం కలిగిన వ్యక్తి అనేది.. ఒక్క వాక్యంలో చెప్పారు. నేడు ఆయన కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

- రాజమహేంద్రిలోనే మొదటి వితంతు వివాహం
- ఆయన అడుగుజాడల్లో నడిచిన భార్య రాజ్యలక్ష్మి
- నేడు కందుకూరి వీరేశలింగం జయంతి



రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్ర భవనం

1848లో జననం

రాజమహేంద్రవరంలోని సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు 1848, ఏప్రిల్ 16న వీరేశలింగంపంతులు జన్మించారు. సుబ్బారాయుడు తన తండ్రి పేరును కుమారుడికి పెట్టుకున్నారు. వీరేశలింగం పూర్వీకులు దివానులు, రెవెన్యూ ఉద్యోగులుగా పనిచేశారు. వారి స్వస్థలం ప్రకాశం జిల్లా కందుకూరు కాగా వీరు రాజమహేంద్రవరం వలస వచ్చి స్థిరపడ్డారు. క్రమేణా ఊరిపేరే ఇంటి పేరుగా మారింది. వీరేశలింగం పంతులుకు 12ఏళ్ల వయసులో కాతేరుకు చెందిన బాపమ్మ(రాజ్యలక్ష్మి)తో 1861లో వివాహం జరిగింది. 1870లో మెట్రిక్యులేషన్, 1872లో ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత పరీక్ష పాసయ్యారు.

సతీమణి సహకారం

వీరేశలింగం సాంఘిక సంస్కరణోద్యమాల్లో ఆయన సతీమణి రాజ్యలక్ష్మి సహకారం ఎంతో ఉంది. వితంతు వివాహాలపై అప్పటి సమాజంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సహాయ నిరాకరణ చేసేవారు. దీంతో రాజ్యలక్ష్మి స్వయంగా గోదావరి నదికి వెళ్లి నీళ్లు తెచ్చేవారు. తర్వాత నుయ్యి తవ్వించారు.

హితకారిణి సమాజానికి ఆస్తులు

వీరేశలింగం తన ఆస్తులను పాఠశాలల స్థాపనకు, హితకారిణి సమాజానికి, సంఘ సంస్కరణకు వినియోగించారు. తన యావదాస్తిని సమాజానికే వెచ్చించారు. చివరికి తన రచనల ద్వారా వచ్చిన ఆదాయంతో జీవించారు. ఆయన రచనల్లో వెనీస్ వర్తక చరితము, రాజశేఖర చరిత్ర, మార్కండేయ శతకం, సంగ్రహ వ్యాకరణం, రత్నావళీ, సత్యవతీ చరిత్ర, శాకుంతలము, శరీర శాస్త్రము, జంతు స్వభావ చరిత్ర వంటి 50 రచనలను ప్రధాన మైనవి. వివేకవర్థని, హాస్య సంజీవని, సతీహిత బోధిని, సత్య సంవర్థని, చింతామణి, సత్యవాదిన, తెలుగు జననం,విద్వన్మనోహారిణి పత్రికల్లో కొన్నింటిని ఆయన స్థాపించి నడపగా.. మరికొన్నింట్లో సంపాదకులు, సహాయ సంపాదకులు బాధ్యతలు నిర్వహించారు.



సంస్కరణలే లక్ష్యంగా..

వీరేశలింగం ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. సమాజంలో ఉన్న దురాచారాలను వ్యతిరేకిస్తూ ఉండేవారు. మతపరమైన, విద్యాపరమైన సంస్కరణలే లక్ష్యంగా బ్రహ్మసమాజాన్ని నెలకొల్పారు. యువజన సంఘాల స్థాపనకు కూడా ఆయనే ఆద్యుడు. తన 33వఏట 1881, డిసెంబరు 11న మొట్టమొదటి వితంతు వివాహాన్ని జరిపించారు. 22ఏళ్ల గోగులపాటి శ్రీరాములు, 12ఏళ్ల గవరమ్మలకు రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఈ వివాహం చేయించారు. వితంతు వివాహాల నిర్వహణకు ఆయన 33మంది సభ్యులతో హితకారిణీ సమాజం ప్రారంభించారు. ఆ రోజు నుంచి ఈ సమాజం తరఫున 63వివాహాలు జరిగాయి.




కందుకూరి వీరేశలింగం పంతులు పరిశోధనా కేంద్రంలో వితంతు వివాహ వేడుకల బొమ్మల ప్రదర్శన

1919లో అస్తమయం

చెన్నైలోని ఎగ్మూరులో ఉన్న వేద విలాస్‌లో 1919, మే 27న వీరేశలింగం అస్తమించారు. ప్రస్తుతం వీరేశలింగం దంపతుల సమాధులు ఉన్న ప్రదేశం ఒకప్పుడు ఆనంద ఉద్యానవనం అనే వాళ్లు. తన స్నేహితుడైన చల్లపల్లి రంగయ్య పంతులు నుంచి వితంతు శరణాలయం నిర్వహణ నిమిత్తం 1905లో రూ.2వేలకు వీరేశలింగం కొన్నారు.ఈ తోటకు చేర్చి ఉన్న చల్లపల్లి రామయ్య తోటను 1906లో రూ.600కు కొన్నారు.



వీటీ కళాశాల వద్ద కందుకూరి దంపతుల సమాధులు



పరిశోధనా కేంద్రంలో కందుకూరి పుస్తక లైబ్రరీ

వివేకవర్థినితో చైతన్యం

1874, అక్టోబరు నెలలో వివేకవర్థని అనే నాలుగు పేజీల మాస పత్రికలను ప్రారంభించారు. దీనిద్వారా అవినీతిపరులపై యుద్ధం చేసేవారు. సాంఘిక దురాచాల నిర్మూలనకు ప్రజలను చైతన్యం చేయడానికి ఈ పత్రికను ఆయుధంగా చేసుకున్నారు. ఈ పత్రిక ప్రచురణకు కింద కంపోజింగ్ ఉంటే పైన గదిలో ఆయన కూర్చుండేవారు. ప్రతులను ఒక తాడుకు బుట్టకట్టి పైకి లాక్కుని సరిచేసి కిందకు పంపించేవా రు. 1885లో ఆయనకు రాజమహేంద్రవరం పురపాలక సంఘ సభ్యుడిగా అవకాశం లభించింది.



అలనాటి అచ్చుయంత్రం



వీరేశలింగం కుర్చీ



పరిశోధనా కేంద్రంలో పెచ్చులూడిన భవనంపైకప్పు

ఆరుగురికి కందుకూరి పురస్కారాలు

- నేడు విజయవాడలో ప్రదానం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటక రంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 107మంది ప్రతిభ కలిగిన నాటకరంగ కళాకారులు, సాంకేతిక నిపుణులకు ప్రభుత్వం కందుకూరి పురస్కారాలను ప్రకటించింది. వీరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆరుగురికి జిల్లాస్థాయి పురస్కారాలు దక్కాయి. వీటిని విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ప్రదానం చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నాటక, సినీ రచయిత డాక్టర్ బుర్రాసాయిమాధవ్ చైర్మన్‌గా 11మంది నాటకరంగ ప్రముఖులతో ప్రభుత్వం నియమించిన ఎంపిక కమిటీ పారదర్శకంగా పురస్కార గ్రహీతలను ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో రంగస్థల పురస్కారంతోపాటు రూ.1లక్ష నగదు, జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రూ.10వేల నగదు అందజేసి సత్కరిస్తామన్నారు. కళా, నాటక రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమానికి కళాకారులు, సాంకేతిక నిపుణులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

- పురస్కార గ్రహీతలు వీరే..

ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన కె.సత్తిబాబు, శ్రీలేఖ, కాకినాడ జిల్లాకు చెందిన కాలపురెడ్డి వెంకటరమణ, నటకుమారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ద్రాక్షారామ సరోజలకు జిల్లా స్థాయి పురస్కారాలు దక్కాయి.



గోకార్ట్ రేసింగ్ ట్రాక్‌లో కార్లు

రేస్‌కు రెడీ

కాకినాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్ ట్రాక్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. మరో రెండు రోజుల్లో యాక్టివిటీస్ ప్రారంభం కానున్నాయి. ఈ రేసింగ్‌కు సంబంధించి సుమారు 11 కార్లు చేరుకున్నాయి. సుమారు ఐదున్నర ఎకరాల్లో ట్రాక్ సిద్ధం చేశారు. పర్యాటకులకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు చెప్పారు.

రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని ప్రజల గోడు వినేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం రాజమహేంద్రవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అల్యూమినియం కాలనీ, తాడితోట, వీరభద్ర నగర్, రైతునగర్, ఆదెమ్మదిబ్బ, శేషయ్యమెట్ట ప్రాంతాల్లో సీపీఐ బృందం పర్యటించి ఇళ్లులేని పేదలను కలుసుకుంది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను కలిసి పేదలకు ఇళ్ల స్థలాల సమస్యలపై మాట్లాడతారన్నారు. అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదల సమస్యలు,వారి బాధలను ఇప్పటికే తాము తెలుసుకున్నామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులుపి.లావణ్య, త్రిమూర్తులు, నగర సమితి నాయకుడు రామరాజు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు, ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐదు బెటాలియన్ల క్రీడాకారులు



క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు
- కాకినాడలో ప్రారంభమైన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు
- పాల్గొన్న నాలుగు బెటాలియన్ల క్రీడాకారులు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండెంట్ నాగేంద్రరావు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి వారితో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బెటాలియన్ నుంచి ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు క్రీడా పోటీల్లో రాణించారన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. అతిథులు శాంతి కపోతాలు, రంగుల బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. కాకినాడ 3వ బెటాలియన్‌తో పాటు విజయనగరం 5వ బెటాలియన్, మంగళగిరి 6వ బెటాలియన్, విశాఖపట్నం 16వ బెటాలియన్ పోలీస్ క్రీడాకారులు రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, వాకింగ్, డిస్కస్‌త్రో, చెస్, క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, ఎస్.మన్మథరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్‌రా వు, విరలేశ్వరరావు, ప్రసాద్, బెటాలియన్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు

20 కిలోమీటర్ల వాకింగ్‌లో ఎం.లక్ష్మణ్, బి.చక్రధర్, టి.శ్రీనివాసరావు. 800 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, వి.సూర్యారావు, బి.రవితేజ, 400 మీటర్ల పరుగులో ఎస్.సురేష్‌కుమార్, జి.మురళి, బి.రవితేజ, డిస్కస్‌త్రోలో టి.ధర్మారావు, ఎస్.కృష్ణారెడ్డి, ఎస్.అబ్రహం, జావెలిన్‌త్రోలో వి.శుభకర్, ఎస్.కృష్ణమూర్తి, ఎస్.అబ్రహం, లాంగ్ జంప్‌లో జి.శ్రీనివాసరావు, వి.సీతారాం, జి.మురళి, షాట్‌పుట్‌లో ఎం.రాంబాబు, ఎం.చంద్రశేఖర్, ఎస్.మోహన్‌రావు... ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. చదరంగం, క్రికెట్ సెమీ ఫైనల్స్ బుధవారం జరుగుతాయి.



పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు



షాట్‌పుట్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారుడు



పరుగు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



జడ్జి మల్లికార్జునరావుకు వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకులు

శనేశ్వర ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

కొత్తపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి మంగళవారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామమూర్తి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం జడ్జి కుటుంబీకులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించారు.



కూపర్ భాను అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కూపర్ భాను సేవలు ఆదర్శనీయం

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహాలకు ఉచితంగా స్వయంగా అంత్యక్రియలు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన కూపర్ భాను అంబేడ్కర్‌ను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేయడం చాలా సహనంతో కూడిన పని అన్నారు. ఎంతో పెద్ద మనసు ఉంటేనే తప్ప ఇలాంటి కార్యక్రమాలు చేయలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అవమానం

● శంఖవరంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు

● భగ్గుమన్న దళిత సంఘాలు ● రోడ్డుపై బైఠాయింపు



అంబేడ్కర్ విగ్రహానికి వేసిన చెప్పుల దండ

శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. ఆగంతకులు మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. ఉదయం 6గంటలకు ఈ సంఘటన వెలుగులోకి రావడంతో స్థానిక కాలనీవాసులు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఉదయం నుంచి రోడ్డుపై బైఠాయించారు. దోషులను శిక్షించేవరకూ ఆందోళన విరమించేదిలేదంటూ భీష్మించారు. అడిషనల్ ఎస్పీ ఎమ్‌జేవీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్, డాగ్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. సీసీటీవీని పుటేజ్‌ని పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.



శంఖవరంలో రోడ్డుపై బైఠాయించిన దళితులు

24 గంటల్లో పట్టుకుంటాం : ఎస్పీ

ఆందోళనాకారులతో చర్చించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ నిందితులను పట్టుకునేందుకు 24 గంటల సమయం కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీఫుటేజ్, ఇతర సీసీ కెమెరాలను పరిశీలించామని, సెల్ టవర్ ఆధారంగా కూడా వారి ఫోన్లను ట్రేస్ చేస్తున్నామని, నిందితుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దళిత సంఘాల నేతలు, పోలీసులతో కమిటీ వేశామన్నారు. విచారణ వేగవంతం చేస్తామని, నిందితులను పట్టుకునేందుకు సహకరించాలని కోరారు. నిందితులను పట్టుకునేవరకూ అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శంఖవరంలోనే ఉంటారని ఆయన తెలిపారు.

నిందితులను గుర్తిస్తే బహుమతి



అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను గుర్తించినవారికి బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్న నిందితుల వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేసామని పోలీసులు తెలిపారు.



నిరసనకారులతో మాట్లాడుతున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లాం : ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు/శంఖవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన ఘటనను హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని, దీనిపై హోం మంత్రి, జిల్లా ఎస్పీలతో మాట్లాడామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై ప్రజలు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు.

ఉమ్మడి జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల్లో
విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన

» అమరావతి ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతిరావు » కాకినాడలో ప్రత్యేక అధికారులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సీతాపతిరావు

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని అమరావతి ప్రణాళిక విభాగం సీనియర్ సలహాదారు డీవీవీ సీతాపతిరావు సూచించారు. కాకినాడ కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అసెంబ్లీ నియోజవర్గాల ప్రత్యేక అధికారులు, ప్రణాళిక యూనిట్ సభ్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవారంగాలు ఎలా అభివృద్ధి చేయవచ్చో తెలిపే విధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క ప్రత్యేక అధికారులకు అనుబంధంగా ఐదుగురు సచివాలయంసిబ్బంది పనిచేస్తారన్నారు. నియోజకవర్గాల్లో ఉన్న అవకాశాలను అనుసరించి వ్యవసాయం, పారిశ్రామికరంగం, సేవా రంగాల అభివృద్ధి చెందే విధంగా ప్లాన్ రూపకల్పన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 3జిల్లాల అర్థగణాంక అధికారులు త్రినాథ్, అప్పల కొండ, వెంకటేశ్వర్లు, జడ్పీసీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్‌లో పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్...
సుడిగాలి పర్యటన

మోతుగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ పవర్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్ ఏపీ సాంబశివరావు సుడిగాలి పర్యటన చేశారు. సీలేరు కాంప్లెక్స్‌లో పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాలను సోమ,మంగళవారాలు స్థానిక జెన్‌కో అధికారులు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పనితీరుపై ఆరా తీశారు.

విద్యుత్ ఉత్పత్తిపై ఆరా

అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కొత్తగా కడుతున్న రెండు యూనిట్ల పనులను కూడా పరిశీలించి ఐదు,ఆరు యూనిట్లు ఎప్పటికీ వినియోగంలోకి వస్తాయని అడిగి తెలుసుకున్నారు. సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై జెన్‌కో అధికారులతో చర్చించారు. ఎగువ సీలేరులోని పార్వతినగర్‌లో నూతనంగా నిర్మించే పంప్ స్టోర్ ప్రాజెక్టు ప్రదేశం, డబ్బింగ్‌యార్డు, ఇంటెక్ డ్యాము, రెగ్యులేర్ డ్యాములను పరిశీలించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, డీఈటీ వరప్రసాద్, లోయర్ సీలేరు అధికారులున్నారు.



పొల్లూరు వాల్‌హౌస్ పెన్‌స్టాక్ పనులను పరిశీలిస్తున్న ఏపీ సాంబశివరావు

పాస్టర్ ప్రవీణ్‌ది ప్రమాదం కాదు.. హత్యే

ఫేక్ వీడియోలు సృష్టించిన పోలీసులు : మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని.. హత్యేనని.. పోలీసులు ఫేక్ వీడియోస్ లీక్ చేసి వాటినే ఆధారాలుగా చూపించి రోడ్డు ప్రమాదంగా మలిచారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మత మార్పిడి చట్టాన్ని వ్యతిరేకిస్తూ 2022 డిసెంబర్ 15న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని, ఈ నెల 16న సుప్రీంకోర్టు బెంచ్ వద్ద ప్రవీణ్ పగడాల తన వాదన వినిపించి ఆధారాలు సమర్పించాల్సిఉందన్నారు. బీజేపీ స్పోక్స్ పర్సన్ అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ, అతని అడ్వకేట్ అశ్విని దుబేలు ప్రవీణ్ పగడాల విషయంలో ప్లాన్ చేసి ఉంటారని ఆరోపించారు. ఈ నెల 19న సాయంత్రం కొంతమూరులో ప్రవీణ్‌కు ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగిస్తామన్నారు. ప్రవీణ్ పగడాలది హత్య అని నమ్మేవాళ్లంతా అక్కడకు రావాలని సూచించారు. ఈస్టర్ పండుగ రోజు క్రైస్తవ బరియల్ గ్రౌండ్‌లో ప్రవీణ్ పగడాల ఫ్లెక్సీ పెట్టి కొవ్వొత్తులు వెలిగించాలని ఆయన కోరారు. సమావేశంలో జీవీ శ్రీరాజ్ పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరమైన ఫొటోలు... డబ్బులివ్వాలని యువతికి వేధింపులు...

బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడి అరెస్టు

14 రోజుల రిమాండ్

ఆలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో అసభ్యకరమైన ఫొటోలను పోస్టు చేసి వేధిస్తున్న యువకుడిని ఆలమూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అమ్మాయితో స్నాప్‌చాట్ ద్వారా కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమెతో తరచు ఫోన్ మాట్లాడేవాడు. అప్పుడప్పుడు న్యూడ్ వీడియో కాల్స్ కూడా మాట్లాడుకునేవారు. అయితే ఆ సమయంలో ఆమెకు తెలియకుండా స్క్రీన్‌షాట్‌తో ఫొటోలు తీసేవాడు. ఈ నేపథ్యంలో ఆమెను డబ్బులు కావాలని డిమాండ్ చేయడం ప్రారంభించాడు. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఇన్‌స్టాగ్రామ్‌లో మూడు అకౌంట్లు ఓపెన్ చేసి ఈ ఫొటోలను పోస్టు చేయడంతో ఆ యువతి ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ దర్యాప్తు చేసి కర్నూలుకు చెందిన పడిపోవు హరీష్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆలమూరు కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి హరీష్‌కు 14రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు జైలుకు తరలించారు. సోషల్ మీడియా యాప్‌ల పరిచయం ఏర్పడిన వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ అశోక్‌లు సూచించారు.

గోదావరి పుష్కర పనుల్లో నిధుల దుర్వినియోగం

మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కర పనుల్లో నిధులు దుర్వినియోగం ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంటు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కొవ్వూరు మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. కొవ్వూరు మున్సిపాల్టీలో పుష్కర నిధులతో చేపట్టిన గోదావరి బండ్ సుందరీకరణ పనుల్లో నిధులు దుర్వినియోగంపై విచారణ అనంతరం జరిమానా కింద అప్పటి మున్సిపల్ ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన పీవీ ప్రభాకరరావు, రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైవీ నరసింహరావు పింఛను నుంచి 3 శాతం ఒక సంవత్సరం పాటు నిలుపుదల చేయాలని, అలాగే రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ బి.శ్రీధర్ పింఛను నుంచి 3శాతం రెండేళ్లపాటు నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

లారీని ఢీకొన్న అంబులెన్స్

ముగ్గురికి స్వల్ప గాయాలు



ఘటనా స్థలంలో అంబులెన్స్

దేవరపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నుంచి అంబులెన్స్‌లో పేషెంట్‌ను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు హైవే వద్ద ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం 6గంటలకు ముందుగా వెళ్తున్న లారీని అంబులెన్స్ ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్, పేషెంట్, పేషెంట్ బంధువుకు స్వల్పగాయాలయ్యాయి. వారిని మరో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మబ్బులే... మదిదోచేనే..

కాకినాడలో ఓ చోట ఆకాశంలో మబ్బులు అలుముకున్నాయి మనసును దోచే ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా

ఫొటోగ్రాఫర్ -కాకినాడ

పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ...

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

⏮ మరో ముగ్గురి పరిస్థితి విషమం

⏮ లారీని కారు వేగంగా ఢీకొనడంతో ప్రమాదం

⏮ నేడు స్వగ్రామానికి మృతదేహాలు



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి, అనూష మృతదేహాలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను కుటుంబ సభ్యులు ఈ నెల 14వ తేదీన తెలంగాణలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి పయమమయ్యారు. జనగామ జిల్లా స్టేషన్ గణాపూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీని వారి కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సత్తి కుటుంబీకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్ర గాయల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సవరప్పాలెం గ్రామానికి చెందిన సత్తి శ్రీను (50), సత్తి రమణకుమారి (45), సత్తి అనూష(22) అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలను జనగామ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదంలో తీవ్రగా గాయపడిన సత్తి రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీను, రమణకుమారి, అనూష మృతదేహాలను బుధవారం స్వగ్రామమైన సవరప్పాలెం తీసుకురానున్నట్టు బంధువులు తెలిపారు. సత్తి కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాజుల రామారం ప్రాంతానికి వెళ్లి గత కొన్నేళ్ల క్రితమే స్థిరపడ్డారు.

చనిపోయిందా? చంపేశారా?



రోడ్డుపక్కన కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

కాళ్లకు పట్టీలు, మెట్టెలు..

తల వద్ద ఖాళీ గాజు సీసా

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన తుప్పల్లో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యంకావడం కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు పంచాయతీ పరిధిలో శ్రీరాంపురం రిజర్వు ఫారెస్టు ప్రాంతం కవలగొయ్యికి వెళ్లే దారిలో తుప్పల్లో మృతదేహం ఉన్నట్టు అదే గ్రామానికి చెందిన కొవులూరి తాతారావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ పి.కాశీ విశ్వనాథం తన సిబ్బందితో ఘటనా ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఒంటిపై లేత గోధుమ రంగు చున్నీ పీలికలు ఉన్నాయి. కాళ్లకు పట్టీలు, మెట్టెలు ఉండడంతో వివాహిత అని గుర్తించారు. ఆమెకు సుమారు 30-35 ఏళ్లు ఉంటాయని, మరణించి 20 రోజులపైనే గడిచి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహం లభ్యమైన చోట ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని పోలీస్ స్టేషన్లకూ సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, వివరాలు తెలిసిన వారు దగ్గరలోని పోలీస్‌స్టేషను, 112కి లేదా 9440796533లో తెలియజేయాలని సీఐ కోరారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో అన్నికోణాల్లో దర్యాప్తు ప్రారంభించామని ఆయన చెప్పారు.

సామూహిక అత్యాచారం జరిగిందా?

మహిళ మృతదేహం పడి ఉన్న స్థితిని గమనిస్తే సామూహిక అత్యాచారం జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తల వద్ద మద్యం ఫుల్ బాటిల్ వంటి సీసా, కాళ్లకు సమీపంలో టిన్ బీర్ ఖాళీ డబ్బా ఉండగా శరీరం 80శాతానికి పైగా కుళ్లిపోయి ఎముకలు కనబడుతున్న స్థితిలో ఉంది. పంజాబీ డ్రెస్ ధరించినట్టు తెలుస్తున్నా.. దుస్తులు దాదాపుగా ధ్వంసమైపోయాయి. చున్నీ ఆమె శరీరంపై లేకుండా పక్కన ఉండడం వల్ల ఇంకా కొద్దిగా గుర్తు పట్టే స్థితిలో ఉండి లేత గోధుమ రంగులో కనబడుతోంది. నోరు పూర్తిగా తెరిచి ఉంది. దీంతో సామూహిక అత్యాచారం చేసి చంపేశారనే అనుమానాలు బలపడుతున్నాయి. చున్నీ మెడకు బిగించి చంపేసినట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు వేరే చోట సామూహిక అత్యాచారం చేసి తీసుకొచ్చి ఇక్కడ పడేశారనే చర్చ కూడా నడుస్తోంది. మృతదేహం ఉన్న చోటు రాజానగరం, బొమ్మూరులో ఏ పోలీస్ స్టేషను పరిధిలోకి వస్తుందనే సందేహంపై చాలాసేపు తర్జనభర్జన జరిగింది. చివరికి బొమ్మూరు పోలీసులు కేసు కట్టి దర్యాప్తు ప్రారంభించారు. మిస్సింగ్ కేసులను పరిశీలిస్తున్నారు.

గోదావరిలో గల్లంతయిన
యువకుల మృతదేహాలు లభ్యం

పోస్టుమార్టం అనంతరం

కుటుంబ సభ్యులకు అప్పగింత

కొవ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతయిన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన మట్టి ప్రకాష్(14), ఉసురుమత్తి రత్నదీప్ అలియాస్ వెస్లీ, రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(17) ఈనెల 14న సోమవారం గోదావరిలో స్నానానికి కొవ్వూరు మండలం సీతంపేట పంచాయతీ పరిధిలోని చిగురులంక వెళ్లారు. నదిలోతు తెలియక మునిగిపోతుండగా అక్కడే ఉన్న పిల్లి దివాకర్ చూసి రత్నదీప్‌ను రక్షించాడు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. నదిలోతు ఎక్కువగా ఉండడంతో మంత్రి ఆదేశాల మేరకు కాకినాడ నుంచి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో రెండు మృతదేహాలను వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. మట్టి ప్రకాష్ తండ్రి కిషోర్‌బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కెశ్రీహరిరావు తెలిపారు.



గంధం హర్ష, మట్టి ప్రకాష్ మృతదేహాలు

వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే హతమార్చాడంటూ ఆసుపత్రి ముందు మృతురాలి బంధువులు ఆందోళన




మరణించిన నూకరత్నం(ఫైల్)

తుని రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం సీతయ్యపేట గ్రామంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాల ప్రకారం.. సీతయ్యపేట గ్రామంలో గ్రామానికి చెందిన సూరడ నూకరత్నం (26)కు దగ్గర బంధువైన శివతో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్టు మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించారు. మంగళవారం నూకరత్నం భోజనం అనంతరం విపరీతమైన వాంతులకు గురికావడంతో స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మహిళ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కట్టుకున్న వాడే కూరలో విషం కలిపి భార్యను హతమార్చాడంటూ ఆరోపించారు. దీంతో పోలీసులు వచ్చి శవ పంచనామ రిపోర్టు ఆధారంగా మహిళ మరణానికి భర్తే కారణమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన ఆపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

వ్యక్తి మరణం వ్యవహారంలో
కేస్ షీట్ వివాదం

కాకినాడ జీజీహెచ్‌లో ఉద్రిక్తత

విచారణ జరుపుతాం: సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి



వీరాంజనేయులు మృతదేహం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మరణం వ్యవహారంలో కేస్ షీట్ వివాదం జరిగి కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన జానా వీరాంజనేయులు (60)కు గతంలో కాలికి దెబ్బ తగిలింది. అతడికి మధుమేహ వ్యాధి ఉండడంతో ఎంతకీ దెబ్బ తగ్గకపోవడంతో గత నెల 27వ తేదీన కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. 30న వైద్యులు కాలి పాదానికి శస్త్రచికిత్స చేశారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు బాగానే ఉన్నాడు. ఆ మర్నాడు అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటి నుంచి సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న అతడికి ఎగ ఊపిరి రావడంతో పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో రక్తం గడ్డకట్టినట్లు నిర్ధారించి బాధితుడిని మెడికల్ వార్డుకు షిఫ్ట్ చేశారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న వీరాంజనేయులును మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వైద్యురాలు డాక్టర్ తన్మయి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే వీరాంజనేయులు మృతి చెందినట్టు కుటుంబీకులు ఆరోపించి ఆందోళనకు దిగుతున్న సమయంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి వార్డుకు చేరుకుని వీరాంజనేయులు మృతికి కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని భరోసా ఇవ్వడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. దీంతో ఆందోళన సద్దు మణిగింది.

అవంతి ఫ్యాక్టరీలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సరిత

ఏలేశ్వరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో అవంతి అగ్రోజెన్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో క్యాంటీన్‌ను జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి సరిత మంగళవారం పరిశీలించారు. ఇక్కడ కలుషిత ఆహారం తిని సిబ్బంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. పరిశ్రమలో తాగునీరు, క్యాంటీన్‌ను సరిత పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం పాలైనవారిలో కొందరు ఫ్యాక్టరీ బయట ఆహారం తీసుకున్నారని, అందుకే ఇలా జరిగి ఉంటుందని పరిశ్రమ సిబ్బంది తెలిపారు. జగ్గంపేటలో ప్రైవేట్ ఆసుపత్రిలో 6మందికి ఇద్దరు మాత్రమే చికిత్స పొందుతున్నారని, 4 మంది డిశ్చార్జి అయినట్టు తెలిపారు. వైద్యులు శ్రీలక్ష్మీ తదితరులున్నారు.

మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మెట్లపై నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన కోట లక్ష్మణరావు (30) సోమవారం ఇంటి వద్ద మేడ మెట్లు దిగుతుండగా జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రత్తిపాడులో పెంకుటిల్లు దగ్ధం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంగళవారం ఉదయం పెంకుటిల్లు దగ్ధమై రూ.4లక్షల ఆస్తినష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు స్థానిక రాజుగారు వీధిలోని రెడ్నం కోటేశ్వరావు, తోట సురేష్‌కు చెందిన పెంకుటిల్లు విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. బీరువాలు, విలువైన సామాగ్రి దగ్ధమయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్థానిక ఫైర్ అధికారి ఎంజీ రత్నరాజు, బి.సూర్యనారాయణ, దుర్గాప్రసాద్‌ల బృందం సంఘటనా స్థలానికి తరలివెళ్లి మంటలు అదుపుచేశారు.

వరుసకు కూతురైన బాలికపై...

మారు తండ్రి లైంగిక దాడికి యత్నం

తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన మారు తండ్రిపై కేసు నమోదైంది. హైదరాబాద్ కమలాపురి కాలనీలో నివాసముండే ఓ మహిళ భర్తతో విడిగా కుమార్తె(10)తో కలిసి ఉంటుంది. కొన్నేళ్లక్రితం కాకినాడకు చెందిన వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరు సహజీవనం చేయడం ప్రారంభించారు. మహిళ గర్భవతి అయింది. ప్రసవానికి ఆస్పత్రికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కుమార్తెపై మారు తండ్రి కన్నేశాడు. అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించాడు. తప్పించుకున్న బాలిక స్థానికులసాయంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో నేడు 'ప్రజా దర్బార్'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పది గంటల నుంచి ఏడీబీ రోడ్డులోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో జరుగుతుంది. టీడీపీ కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు వన మాడి మోహనవర్మ హాజరవుతారు.



రాజాను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వల్లూరి రాజాను దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక వ్యవస్థాపకుడు డోకుబుర్ర భద్రం మాస్టారు ఆధ్వర్యంలో సత్కరించారు. మంగళవారం జగన్నాథపురం ఘాటీ సెంటర్ వద్ద బహుజన మహనీయులు జ్యోతిరావుఫూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్, కాన్షీరామ్ సామూహిక జయంతి నిర్వహించారు. కుందేటి మోజేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సేఫ్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌ను ఐక్య వేదిక సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, కంతీదేవిపేట పెద్దలు, మీసాల చెన్నయ్యపేట పెద్దలు, కమిటీ సభ్యులు శాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు ఆశీర్వాదం, పాలేటి కృపానందం, కొమ్ముకూరి నాగేశ్వరరావు, ఏడిద లాజరు, పెదపూడి స్వామి, తాతపూడి అప్పారావు, సాపే సుధాకర్, సిద్దాంతపు రాజు, కొండేపూడి రవి, సలగాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్ నుంచి ల్యాప్‌టాప్ అందుకుంటున్న శుభశ్రీ

శుభశ్రీకి ప్రభుత్వ పురస్కారం

పిఠాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కాపుగంటి సత్య రాజ్యలక్ష్మి శుభశ్రీకి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం లభించింది. ఇంటర్ ఒకేషనల్, సెరికల్చర్ విభాగంలో 1,000కి 977 మార్కులు సాధించి రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెకు ల్యాప్‌టాప్, రూ20వేల నగదు, గోల్డ్‌మెడల్‌లను మంగళవారం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అందించి సత్కరించారు. తల్లిదండ్రులు సర్వారాయుడు, సునీతలను అభినందించారు.



ప్రకృతి వ్యవసాయ విధానంపై సూచనలిస్తున్న ఏడీ బాబూరావు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కరప, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించాలని వ్యవసాయ శాఖ కరప సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.బాబూరావు సూచించారు. వాకాడలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, దీనిపై అవగాహన పెంపొందించుకుని ఆచరించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ ధనలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ దూడల నారాయుడు, నాయకులు కామిరెడ్డి సురేష్, పెంకే సోమరాజు పాల్గొన్నారు.



ఫైర్ రెస్క్యూ పరికాలను పరిశీలిస్తున్న ఓఎన్జీసీ ఈడీ రిత్నీష్‌కుమార్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కాకినాడ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఆ శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు ఆధ్వర్యంలో సాలిపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది భానుగుడి జంక్షన్, నాగమల్లితోట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో మంటలను ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక, విపత్తు సమయాల్లో చురుగ్గా వ్యవహరించేందుకు ప్రజలకు, సిబ్బందికి ఉపయోగపడే అత్యాధునిక ఫైర్, రెస్క్యూ పరికరాల ప్రదర్శనశాలను కాకినాడ ఓఎన్జీసీ కార్యాలయంలో ఈడీ రిత్నీష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. జిల్లాలోని జేఎన్టీయూ, జ్యూయల్ మిడోస్, వాకలపూడి జడ్పీ ఉన్నత పాఠశాల, ఓఎన్జీసీ సంస్థలైన ఓజీటీ మల్లవరం, ఓఓటీ ఓడలరేవు, ఆఫ్‌షోర్‌ల్లో అవగాహన సదస్సులు జరగనున్నాయి. ఎస్ఎంఈడీ ప్రభల్‌సేన గుప్తా, ఫైర్ సర్వీసెస్ ఇన్‌చార్జి విజయ్.పి.కేల్, ఫైర్ ఇన్‌చార్జిలు శర్మ, అభిషేక్, భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'చిన్నారులను సెల్‌కు దూరంగా ఉంచాలి'

పిఠాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను సెల్‌కు దూరంగా ఉంచాలని, దాని వ్యామోహంలో పడి మానసిక కుంగుబాట్లకు గురవుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని బర్నింగ్ టూల్ మినిస్ట్రీస్ చర్చిలో షాలెమ్ గాస్పల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సండే స్కూల్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులు, యువత సెల్‌ఫోన్‌పై కాకుండా చదువు, ఆటపాటలపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. వారిని సన్మార్గంలో నడిపించేలా సైకాలజీ మోటివేషన్, టీచింగ్ మెథడ్స్ అంశాలపై టీచర్లకు సేవా భారత్ టీమ్ ప్రతినిధులు నానాజీ, నానిబాబు, ఎలీషా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ కరుణరాజ్, పీసీపీ డబ్ల్యూఏ సెక్రటరీ సోంబాబు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సండే స్కూలు టీచర్లు

'దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు ఆశాలు సిద్ధం కావాలి'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధనకు ఆశా కార్యకర్తలు ఆగస్టులో దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆవిర్భవించి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన శేషుబాబ్జీ తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సభను ప్రారంభించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ ఆశాలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లోని ఆశా కార్యకర్తలకు ఏపీలో కంటే అధిక వేతనం చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంబంధం లేని అనేక ఇతర పనులను అప్పగించి పని భారం పెంచుతున్నారన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, మలకా నాగలక్ష్మి, ఎం.లక్ష్మి, సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర సహ కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, పద్మరాణి, ఆశాజ్యోతి, కె.గంగా భవాని, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జీ

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అపరిచితుల ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఎస్‌ఐలతో సమీక్షించారు. సర్కిల్ పరిధిలో నమోదైన కేసులు, వాటి పరిష్కారంపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌ల వలలో పడి యువత భారీగా సొమ్ములు నష్టపోతున్న తరుణంలో వాటివైపు మరలకుండా అవగాహన కల్పించాలన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై, గంజాయి విక్రయాలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌ఐలు మణికుమార్, జానీబాషా, రామకృష్ణ పాల్గొన్నారు.



పిఠాపురం సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐలతో సమీక్షిస్తున్న సీఐ శ్రీనివాస్

శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగిన నేపథ్యంలో గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలపై నిఘా ఉంచడంతో పాటు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు.

పిఠాపురం సర్కిల్ కార్యాలయానికి మంగళవారం ఎస్పీ బిందుమాధవ్ ఆకస్మికంగా వచ్చారు. శంఖవరం వెళ్తూ ఇక్కడ ఆగారు. తిరిగి వస్తూ గొల్లప్రోలు స్టేషన్‌లో ఆగారు. చేబ్రోలులో జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో పురోగతిపై ఆరా తీసినట్టు సమాచారం.

వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం బైపాస్‌లోని పాదగయ కూడలి వద్ద మంగళవారం రాత్రి ఆయన వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.



సంపరలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం

కరప, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పర్యటించారు. సంపరలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను, రూ.4.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన రెండు గోకులం షెడ్లను, రూ.4 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంపర, ముక్తేశ్వరం గ్రామాల్లో రూ.40లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పట్టణ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం మీనామాధురి

ఇంటర్ టాపర్లకు సత్కారం

సామర్లకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్లస్ టు విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బైపీసీలో నూతలపాటి శ్రీమాన్విత (848), సీహెచ్ శ్వేత (843), టి.హరివర్షిణి (800) మార్కులతో పట్టణంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎంపీసీ గ్రూపులో బత్తుల ఝాన్సీ (779), జువ్వాదుల అర్చన (692) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. మంగళవారం వారిని హెచ్ఎం మీనా మాధురి అభినందించారు. ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ తృతీయ బహుమతులుగా రూ.వెయ్యి చొప్పున నగదును అందజేశారు. ఇంగ్లిష్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అధ్యాపకుల సౌజన్యంతో రూ.వెయ్యి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు హనుమంతరావు, విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ పి.భవాని, తల్లితండ్రులు పాల్గొన్నారు.



మోజెస్‌ను అభినందిస్తున్న చిన్నయ్యదొర

బీజేపీలోకి మోజెస్

సామర్లకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు షైల బత్తుల జానీమోజెస్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆ పార్టీ స్థానిక నాయకుడు డాక్టర్ గొరక పూడి చిన్నయ్యదొర మంగళవారం సాయంత్రం అభినందించారు. పుప్పాల నాగ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో ఫోనులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'ధాన్యం కొనుగోలులో రైతు భరోసా కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం'

కొత్తపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పిఠాపురం నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగట్లేదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. మంగళవారం ఆయన గోర్స, కొమరగిరి గ్రామాల్లో పర్యటించారు. దాళ్వా వరి చేలు, ఒబ్బిడి చేసిన ధాన్యం వద్ద కొనుగోలు లేక దిగాలుగా ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ దాళ్వాలో నియోజకవర్గంలో సుమారు 50 శాతం వరి కోతలు జరిగాయన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సహకరించకపోవడంతో ధాన్యం విక్రయానికి రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. అధికారులకు ఫోను చేసి రైతుల సమస్యలను వివరించారు.

మహాన్నదానం

సామర్లకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పట్టణంలోని వినాయక రైస్‌మిల్లు సమీపంలో గల శ్రీరామాలయం వద్ద ఆలయ కమిటీ మంగళవారం ఏర్పాటు చేసిన మహాన్నదానాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. తొలుత ఆయన సీతారామచంద్రులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 3వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

తృణధాన్యాలతో ఆరోగ్య ఆహారం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తృణ ధాన్యాలతో ఆరోగ్య ఆహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి తెలిపారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చేబ్రోలులోని అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, తల్లులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

పెద్దాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామారావుపేటలో అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. నిత్యావసర సరుకులు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, అనివిళ్ల శాస్త్రి, నూనె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం జేఏసీ కన్వీనర్‌గా ముక్తార్ అలీ

పెద్దాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక షాహి జామియా మసీదులో మంగళవారం జరిగిన సమావేశంలో పెద్దాపురం పట్టణ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్‌గా ముహమ్మద్ ముక్తార్ అలీని ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన పలువురు ముస్లింలను జేఏసీగా ఏర్పాటు చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు అమలు నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో పాటు వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లిం సమాజానికి కలిగే నష్టాలపై మసీదుల్లో అవగాహన కల్పించేందుకు జేఏసీ పని చేస్తుందని వారు పేర్కొన్నారు. పట్టణంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని, తమ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. ముస్తఫా, ఆషిక్ అలీ, నవాబ్ జానీ, షేక్ గౌస్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చినరాజప్పకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం

కరప, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ వ్యవస్థాపకుడు, సీఓఐసీసీ రాష్ట్ర డయాసిస్ బిషప్ మేడపాటి రాజకుమార్ ఆధ్వర్యంలో నడకుదురు క్రైస్ట్ బిలీవర్స్ చర్చిలో మంగళవారం దైవ సేవకుల సమావేశం జరిగింది. పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జనావళి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మందపల్లి శ్యామ్‌ను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు జి.జాన్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడు సాల్మన్‌రాజు, సెక్రటరీ మోసా థామస్, జాయింట్ సెక్రటరీ ప్రసన్నరాజు, ట్రెజరర్ సిర్రా జాన్‌భాస్కర్, కన్వీనర్ వీఆర్ గాబ్రియేల్, పాస్టర్లు పాల్గొన్నారు.

గోరింటలో 'పోషన్ పక్వాడా'

గండేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని గోరింట గ్రామంలో నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. బాలింతలకు, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు, పిల్లలకు పోషకాహార విలువలను వివరించారు.

వచ్చే నెల ఒకటి నుంచి

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 8 నుంచి 14 సంవత్సరాలు వయసు గల బాలబాలికలకు మే 1 నుంచి 31 వరకు 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ మంగళవారం తెలిపారు. ఒక్కో శిబిరంలోను 25 మంది బాలురు, 25 మంది బాలికలు ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడా అసోసియేషన్లు, పాఠశాలల పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, సీనియర్ క్రీడాకారులు క్రీడ పేరు, క్రీడా ప్రాంగణం పేరు, ప్రభుత్వ స్థలం లేక ప్రైవేట్ స్థలం వంటి వివరాలు తెలపాలి. క్రీడ ఇన్‌చార్జి పేరు, మొబైల్ నెంబర్, గ్రామం /పట్టణం, మండలం పేరు, ఇన్‌చార్జి హోదా, గ్రామీణ/పట్టణ క్యాంపు క్రీడా ప్రాంగణం అనుమతి లేఖ వంటి వివరాలతో ఈ నెల 17వ తేదీలోపు ఈ-మెయిల్ ద్వారా గానీ లేదా కాకినాడలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయానికి నేరుగా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 99851 13210 నెంబరును సంప్రదించాలన్నారు.

డిప్యూటీ కమిషనర్ మనోహర్ బదిలీ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.మనోహర్ గుడివాడ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ జీవో నెం.303 జారీ చేశారు.

శునకాల నియంత్రణకు చర్యలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు నగర పంచాయతీ కమిషనరు నామా కనకారావు తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ స్టెరిలైజేషన్ (శస్త్ర చికిత్స) చేసే బాధ్యతను కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచుర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా రెండో విడతగా పట్టణంలోని మార్కండేయపురం, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని కాకినాడ కార్పొరేషన్‌కు చెందిన వాహనంలో ఏబీసీ సెంటర్‌కు తరలించారు. కమిషనర్ కనకారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రఘుప్రసాద్, ఎస్‌కే షారూఖ్, వై.సతీష్ పర్యవేక్షించారు.

రేపు ప్రభుత్వ పాఠశాలల

మెగా వార్షికోత్సవం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆకాంక్షలకు అనుగుణంగా కాకినాడ అర్బన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలను ఇప్పటికే నిర్వహించారు. ఇందులో భాగంగా రాజీవ్‌గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మెగా వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు కాకినాడ అర్బన్ ఎంఈవోలు కేవీవీ సత్యనారాయణ, చెవ్వూరి రవి తెలిపారు. కలెక్టర్‌తో పాటు కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. మెగా వార్షికోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, విజయవంతానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది కృషి చేయాలని కోరారు.

ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 38వ వార్డులోని 12వ శానిటేషన్ సర్కిల్ వద్ద పారిశుధ్య పనులను కమిషనర్ భావన మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ వాహనాలు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ ఇంటింటా చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డి.పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

'తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి'

కరప, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ కోరారు. గొల్లపాలెం సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ఆయన పలువురు నేతలతో కలిసి పరిశీలించారు. నీటి నిల్వలు, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్ల నిర్వహణపై ఆరా తీశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పుణ్యంతుల శివాజీ, నాయకులు రొక్కాల సత్తిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, నిమ్మన రాజేష్, దేవు పట్టాభి, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాదగయ వద్ద మజ్జిగ చలివేంద్రం

పిఠాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాదగయ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ వీరభద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురంలో భారీ అన్నదానం

తొండంగి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీతారంపురం గ్రామంలో దుర్గా దేవి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని మంగళవారం భారీ అన్న దానం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సారిపల్లి బాబూ రావు, గింజాల సూరిబాబు గ్రామ పెద్దలు, గ్రామ యూత్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యం మణిహారం.. ఏపీ జెన్కో

● 1976లో మొదటి యూనిట్ ప్రారంభం ● లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి



డొంకరాయి జలాశయం



కొత్తగా నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్లు

మోతుగూడెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ప్రజలకు నిరంతరంగా ఏడాది పాటు విద్యుత్తును అందించే సీలేరు కాంప్లెక్స్‌కు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. జల విద్యుత్ యూనిట్లు నెలకొల్పిన రోజు నుంచి అంచెలంచెలుగా యూనిట్లను ఏర్పాటు చేసి జలవిద్యుత్‌లో అనేక రికార్డులను సొంతం చేసుకుంది. ఇక్కడ పని చేస్తోన్న జెన్కో యాజమాన్యంతో పాటు ఇంజనీర్లు, ఉద్యోగస్తులు కార్మికుల కృషితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జల విద్యుత్తును ప్రజలకు అందిస్తూ వెలుగునిస్తోంది. సీలేరు కాంప్లెక్స్ పరిధి ఒడిశా-ఆంధ్ర సరిహద్దున ఉండటంతో పాటు దట్టమైన అటవీ ప్రాంతం పెద్ద పెద్ద నదులు, జలాశయాలు, కొండలు ఉండటంతో జల విద్యుత్‌కు కావలసిన నీరు పుష్కలంగా ఉండటంతో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని ఇంజనీర్లు తెలియజేస్తున్నారు. అనేక డ్యాములు, కాలువలు ఇక్కడ ఉండటంతో ఏడాది పొడవునా నీటి లభ్యత ఉండటంతో జలవిద్యుత్ ఉత్పత్తి నిరంతరంగా సాగుతోంది. నాటి నుంచి నేటి వరకు అనేక రికార్డులను సృష్టిస్తూ సీలేరు కాంప్లెక్స్ దేశంలోనే గొప్ప జల విద్యుత్ కేంద్రంగా పేరు సంపాదించుకున్నది.

1976లో మొదటి యూనిట్ ప్రారంభం

సీలేరు కాంప్లెక్స్ ఏర్పాటు 1976 మార్చి 28న మొదటి జల విద్యుత్ యూనిట్‌ను ప్రభుత్వం ఏపీ జెన్కో యాజమాన్యం పేరుతో ప్రారంభించింది. ఆ తర్వాత అదే ఏడాదిలో రెండోది 1976 ఆగస్టు 13లో ప్రారంభించారు. కాగా మూడోది 1977 నవంబరు 8లో, నాలుగవది 1978 ఆగస్టు 13లో ప్రారంభించి నిరంతరం జలవిద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ప్రతి ఏడాది రికార్డులను అధిగమిస్తూ వస్తుంది.

సీలేరు జలవిద్యుత్‌కి ఆరు జలాశయాలు

సీలేరు జలవిద్యుత్‌కి ఆరు పెద్దపెద్ద జలాశయాలు(డ్యాం) ఏర్పాటు చేసింది. ఈజలాశయాల నుంచి మోతుగూడెంలో ప్రాం తంలోని పొల్లూరు వరకు అనేక కాల్వలను ఏర్పాటుచేసి జలవిద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఆరు జలాశయాల్లో బలిమెల రిజర్వా యర్(ఒడిసా), గుంటవాడ జలాశయం, ఏవిపి జలాశయం, పికాప్ జలాశయ, డొంకరాయి జలాశయం, ఫోర్ బై జలాశయాలు ముఖ్య మైనవి. 365 రోజులు పాటు ఈజలాశయాలు జలవిద్యుత్‌కి కావలసిన నీటిని పుష్కలంగా అందిస్తున్నాయి. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో మాచ్చి కండ్ సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 1097 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఏపీ జెన్‌కో అధికార వర్గాలు తెలిపాయి. మాచ్చ్ కండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లు ద్వారా 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవు తుంది. సీలేరు ప్రాజెక్టులో నాలుగు యూనిట్లు ద్వారా 240మెగావాట్లు విద్యుత్ అవుతుంది. డొంకరాయిలో ఒక యూనిట్ ద్వారా 25మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్లు ద్వారా 460మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇదేకేంద్రంలో మరో రెండు యూనిట్లు ప్రారంభించారు. ఈపనులు రూ.530కోట్లతో చేపట్టనున్నారు. ఇవిపూర్తయితే అదనంగా 2003యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కానుంది.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి



చింతూరు మండలం మోతుగూడెం పరి. దిలో ఉన్న పొల్లురు జల విద్యుత్ కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి విద్యుత్ ఉత్పత్తి సాధించినట్లు ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు తెలిపారు. 2024-25లో 1.084మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా 1.097మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించినట్లు వివరించారు. ఎప్పటికప్పుడు 4యూనిట్లలో సాంకేతిక సమస్యలు సరిచేస్తూ విద్యుత్ ఉత్పత్తి సాధిస్తున్నామని తెలిపారు. చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు అధికారులు, ఇంజనీర్స్, కార్మికులను అభినందించారు. సీలేరు జలాశయాలు పూర్తిస్థాయిలో నీరు ఉండటంతో వచ్చే ఏడాది పొల్లూరు జల విద్యుత్ కేంద్రం లక్ష్యానికి మించి జలవిద్యుత్ ఉత్పత్తి సాధించే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఎగువ సీలేరులో ఎత్తిపోతల పథకంతో ఉత్పత్తి
ఎం.సుజయ్ కుమార్ ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్



ఎగువ సీలేరులో ఎత్తిపోతల పథకం ద్వారా జలవిద్యుత్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ఈ ప్రాజెక్టు ద్వారా 1350మెగావాట్ల సామర్థ్య గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం పనులు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు కావలసిన అనుమతులన్నీ మంజూరయ్యాయి. ఒక్క అటవీ అనుమతులు రావాల్సి ఉంది. అన్ని మంజూరు కాగానే టెండర్లు దక్కించుకున్న మెగా కంపెనీ పనులు చేయడానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 180 మిలియన్ యూనిట్లు వరకు ఉందని, హైడల్ థర్మల్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. వచ్చే మార్చి నాటికి విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే ఆకాశం ఉంది.

చదలవాడ సబ్‌సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు పీహెచ్‌సీ తులసిపాక పరిధిలోని ఇంటీరియర్ ఔట్రీచ్ ఆవాసం చదలవాడ సబ్ సెంటర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సామూహిక ఆరోగ్య విద్యా సదస్సు నిర్వహిం చారు. ఇండోర్ రెసిడ్యూవల్ స్ప్రే, మలేరియా తగ్గింపులో ఐఆర్‌ఎస్ ప్రాముఖ్యత, విపరీతమైన వేడి సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్యకరమైన పద్ధతులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రజలకు, ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఉదయ్ కుమార్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిషేధిత చిన్న చేపలు తరలిస్తుండగా పట్టివేత



దేవీపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిషేధిత చిన్న చేపలను అక్రమంగా తరలిస్తుండగా దేవీపట్నం పోలీసులు పట్టుకున్నారు. చేపలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎఫ్‌డీవోకి అప్పగిస్తామన్నారు.

చేపలు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

'తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి'

కరప, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ కోరారు. గొల్లపాలెం సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ఆయన పలువురు నేతలతో కలిసి పరిశీలించారు. నీటి నిల్వలు, క్లోరినేషన్, ఫిల్టర్‌బెడ్ల నిర్వహణపై ఆరా తీశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పుణ్యంతుల శివాజీ, నాయకులు రొక్కాల సత్తిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, నిమ్మన రాజేష్, దేవు పట్టాభి, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పాఠశాలల మెగా వార్షికోత్సవం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ఆకాంక్షలకు అనుగుణంగా కాకినాడ అర్బన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలను ఇప్పటికే నిర్వహించారు. ఇందులో భాగంగా రాజీవ్‌గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలలకు సంబం ధించి మెగా వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు కాకినాడ అర్బన్ ఎంఈవోలు కేవీవీ సత్యనారాయణ, చెప్పూరి రవి తెలిపారు. కలెక్టర్‌తో పాటు కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పా ల్గొంటారన్నారు.

సేఫ్టీ కోన్లు ఏర్పాటు ఇలానేనా!

హైవే అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాల బారిన ప్రయాణికులు



గండేపల్లి- బొర్రంపాలెం హైవే మధ్యలో పడి ఉన్న సేఫ్టీ కోన్లు

గండేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. హైవే పనుల్లో భాగంగా అవసరంలేని చోట కూడా హైవే అధికారులు సేఫ్టీ కోన్లు ఏర్పాటు చేసి రాత్రి, పగలు వదిలేయడంతో అవి గాలికి రోడ్డు మధ్యలో పడడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం వచ్చిన గాలి వానకు గండేపల్లి హైవేపై పలుచోట్ల కోన్లు ఎగిరి పడడంతో పలువురు గాయాలపాలయ్యారు. అయితే కోన్లు ఏర్పాటు చేసేటప్పుడు ఒకదానికి ఒకటి తాళ్లు కట్టి లైను పద్ధతిలో ఏర్పాటు చేయాలి. కానీ తాళ్లు కట్టకుండా పలుచోట్ల ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి
ఎంపీడీవో రాజేశ్వర్రావు

తొండంగి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ లబ్ధిదారులు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్రావు సూచించారు. ఈనెల 15 నుంచి మే 10 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. లబ్దిదారుడు ఎస్సీ కులానికి చెంది కులధృవీకరణ కలిగి ఉండాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 21 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. జనరిక్ ఫార్మసీ పథకాలకు డి ఫార్మసీ, బిఫార్మసీ, ఎం ఫార్మసీ ఉండాలన్నారు. ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్ ఉండాలన్నారు. రేషన్, కుల ఆదాయ ధృవీకరణపత్రాలు ఉండాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో కూలింగ్ వాటర్ మిషన్ ప్రారంభం



ప్రభుత్వాసుపత్రిలో కూలింగ్ వాటర్ మిషన్ ప్రారంభిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎమ్మెల్యే సత్యప్రభ రాజా అభిమానుల సహకారంతో కూలింగ్‌వాటర్ మిషన్‌ను ఆసుపత్రి వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, అంబటి బుజ్జి, గోపిశెట్టి శ్రీను ప్రారంభించారు. సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఎమ్మెల్యే సత్యప్రభ రాజా అభిమానులు చేస్తున్న అభివృద్ధి పనులను ప్రశంసించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చలంకూరి భాను, ముత్యాలరాంబాబు, పత్రి రమణ, రాజేంద్ర, మోర్త లాజర్, బిత్రా రాంబాబు, మొప్పనబోయిన ఏసుబాబు, శెట్టిబత్తుల నాని తదితరులు ఉన్నారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం తోటపల్లి, ఒమ్మంగి, చినశంకర్లపూడి గ్రామంలో దాడులు నిర్వహించి 47లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. తోటపల్లిలో 10లీటర్ల సారాతో తెడ్ల గణేష్‌ను, ఒమ్మంగిని నార్లంక వరలక్ష్మిని 12లీటర్ల సారాతో, చినశంకర్లపూడిలో 25లీటర్ల సారాతో మానూరి నాగ వెంకట దుర్గను అరెస్ట్ చేశారు. పెదశంకర్లపూడిలో సారా సరఫరా చేసిన కోట సూర్యప్రకాశరావుపై కూడా కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారులు ప్రత్తిపాడు, రంపచోడవరం స్టేషన్ల సరిహద్దులో ఉన్న గొంటిమానిపాలెంలో దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ రేణుక, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కె.జయమౌనిక,సీఐ ఇంద్రజిత్ ఉన్నారు.



తోటపల్లిలో దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

'నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలి'



జగ్గంపేటలో తహశీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలంలోని మల్లిసాల, గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామాల పరిధిలో గల సర్వేనెంబర్ 353లో 5085ఎకరాల అడ కొండ భూమిని రెండున్నర దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న దళిత, గిరిజన నిరుపేదలకు పట్టాల మంజూరు చేయాలని, అగ్రవర్ణ భూస్వాములైన సామర్లకోటకు చెందిన ఏలేటి కుటుంబాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జగ్గంపేట తహశీల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి వినతులు ఇచ్చారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ రెండు గ్రామాల ప్రజలు వెనకడుగు వేయకుండా, రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. అధికారులు తక్షణం నిరుపేదలైన దళిత గిరిజనులకు హక్కు కల్పించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.రామలింగేశ్వరరావు, సురేష్ డాన్ శీను, జాను, పీడీఎస్‌యూ విద్య మన రాష్ట్ర కార్యదర్శి కేసతీష్, ప్రజలు పాల్గొన్నారు.

'సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మెట్ల రమణబాబు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మెట్ల రమణబాబు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాలతో మంగళవారం ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం రౌతులపూడి మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెట్ల రమణబాబు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కుటుంబ సాధికారిత సారథుల నియామకం స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహం అంశాలపై చర్చించారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు, జ్యోతుల పెదబాబు, యాళ్ళ జగదీష్ తదితరులున్నారు.

'అంబేడ్కర్ విగ్రహానికి
చెప్పుల దండ వేసినవారిని అరెస్టు చేయాలి'

రౌతులపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసినవారిని తక్షణం అరెస్టు చేయాలని రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ సంఘం ఆదేశాలకు మేరకు శాంతియుతంగా నిరసన చేశారు. పోలీస్‌లు తక్షణం ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.



గిడజాం గ్రామంలో నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

రాజాశ్రమ వార్షికోత్సవ వేదాంత మహాసభలు



నాగేంద్ర చౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట/గండేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం ముం దూరు క్షేత్రంలో గల శ్రీయజ్ఞ వల్క్య రాజశ్రమవు67వ వార్షికోత్సవ వేదాంత మహాసభలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసభలు బుధ, గురువారం కూడా జరుగుతాయి. ఈమహాసభలకు ముఖ్య అతిథిగా జగ్గంపేట నుంచి భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి హాజరయ్యారు. భారతీయజనతా పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గారపాటి సీతారామాంజనేయ చౌదరి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా నాగేంద్ర చౌదరిని ఘనంగా సత్కరించారు.

కూనవరం తొలి సర్పంచ్ మృతి



కూనవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కూనవరం పంచాయతీ తొలి సర్పంచ్ ముస్తాఫా (95) మృతిచెందారు. పంచాయతీ వ్యవస్థ ఏర్పడిన తర్వాత కూనవరం పంచాయతీకి ముస్తాఫా తొలి సర్పంచ్. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్తాఫా అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావుకు దగ్గర సన్నిహితుడు. ముస్తాఫా ముస్లిం పెద్దగా వ్యవహరించేవారు. ఆయన మృతిపై కూనవరం సీపీఐ నాయకుడు జుత్తుక సూర్యచంద్రరావు, పలువురు సంతాపం తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): స్థానిక 38వ వార్డులోని 12వ శానిటేషన్ సర్కిల్ వద్ద పారిశుధ్య పనులను కమిషనర్ భావన మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ వాహనాలు అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ ఇంటింలా చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీ సర్ డి.పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టౌన్ పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం కూడా అన్నదానం జరిగింది. రమేష్ హాజరై పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో నాగుమల్లి మణికంఠ, రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, సూరపురెడ్డి నరేష్‌కురుమళ్ళ నాగేశ్వరరావు, సత్తి సోమవారాజు, గంధం శ్రీనివాస్, డ్రిల్ మాస్టారు కనకరాజు,సతీష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి పైప్‌లైన్ల పరిశీలన

తొండంగి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోదాడ గ్రామంలో మరమ్మతులకు గురైన సాగునీటి పైప్‌లైన్లను ఎంపీడీవో రాజేశ్వర్రావు మంగళవారం పరిశీలించారు. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శి జగ్గారావు, పంచాయితీ సిబ్బందిని ఆదేశించారు. ఈవోఆర్డీ మార్కండేశ్వర్రావు, విజయబాబు పాల్గొన్నారు.

గునిపే భరత్ పుట్టిన రోజు

జగ్గంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోకవరానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపే భరత్ పుట్టిన రోజు వేడుకలు జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద జరిగాయి. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కిర్లంపూడి మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, మండపాక అప్పన్నదొర, చీకట్ల శ్రీను, జిమ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

'సహజ ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధంగా పండించే ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం సాధ్యపడుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా డైరెక్టర్ కె.ఎలియాజర్ తెలిపారు. మండలంలోని ఉత్తరకంచి గ్రామంలో ప్రకృతి సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులు సర్పంచ్ మంతెన రమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గున్నా బత్తుల రాజబాబులు మంగళవారం పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా డైరెక్టర్ ఎలిజాయర్, హెచ్‌ఎన్ ఎన్‌ఎఫ్ఎఫ్ శిరీష మాట్లాడుతూ ప్రతి కుటుంబం 5నుంచి 7రకాల ఆహార పదార్థాలు తీసుకోవాలని, దీని వల్ల కలిగే ఆహార ప్రయోజనాలు వనగూరుతాయన్నారు. మండల టీం లీడర్ నికేష్ శర్మ, చినబాబు, శాంతి, రామకృష్ణ, వాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలున్నారు.

పోషన్ పక్వాడా కార్యక్రమం

గండేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని గోరింట గ్రామంలో నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు, పిల్లలకు పోషకాహార విలువలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, టీచర్ వీరలక్ష్మి, ప్రిన్సిపాల్ ఉండవల్లి రాజు పాల్గొన్నారు.

'మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు'

తుని రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అవసరాల సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఏడిఏ బుల్లిబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి అధికారి అశోక్‌తో కలిసి కుమ్మరలోవ వ్యవసాయ క్షేత్రాల్లో ఆయన పర్యటించారు. రైతులతో సమావేశమై నువ్వుల పంట సాగుపై అవగాహన కల్పించారు. వేసవిలో పంటలను కాపాడుకునే మెళకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఏ అప్పారావు, వీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నువ్వుల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

ప్రిన్సిపాల్‌ను సత్కరించిన అధ్యాపకులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం ప్రభుత్వజూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, తమ పిల్లలను ఇంటర్మీడియట్ కళాశాలలోనే జాయిన్ చేయాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కోసం అధ్యాపకులు ఏలేశ్వరంలో పర్యటించారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంతో పాటు ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలను, విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.రాజశేఖర్‌ను అధ్యా పకులు బాబ్జి, పలివెల శివాజీ, జి.అనిల్, వాగు మాధవ్, ఉషామాధురి, కనకరాజు, జ్యోతి, రాజేంద్రప్రసాద్ తదితరులు పూలమాలలతో సత్కరించారు.

శునకాల నియంత్రణకు చర్యలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు నగర పంచాయతీ కమిషనరు నామా కనకారావు తెలిపారు. యా నిమల్ బర్త్ కంట్రోల్ స్టెరిలైజేషన్ (శస్త్ర చికిత్స) చేసే బాధ్యతను కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచుర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ సంస్థకు అప్పగించారు. ఇందులో భాగం గా రెండో విడతగా పట్టణంలోని మార్కండేయపురం, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో కుక్కలను పట్టుకుని కాకినాడ కార్పొరేషన్‌కు చెందిన వాహనంలో ఏబీసీ సెంటర్‌కు తరలించా రు. కమిషనర్ కనకారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రఘుప్రసాద్, ఎస్‌కే షారూఖ్, వై.సతీష్ పర్యవేక్షించారు.